క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కామవరపుకోట: జాగుడుగూడెం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు గురువారం స్థానిక షేర్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు తమ్మిశెట్టి రత్నగిరి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సహాయం కావాల్సిన వారు తమను సంప్రదించాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ తమ్మిశెట్టి బసవయ్య, షేక్ ఇబ్రహీం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మళ్ళా రాజు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం



మహాపూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శరత్కాల పూర్ణిమ రోజు అమ్మవారి పూజ విశేష ఫలాలను అందిస్తుందని వీరంపాలెం ఆధ్యాత్మిక ప్రతినిధి బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ శర్మ అన్నారు. నూకాలమ్మ ఆలయంలో నిర్వహించిన చండీహోమ కార్యక్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల మహాపూర్ణాహుతిని ఆలయ కమిటీ, అర్చకులు సమర్పించారు. ఆలయకమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ చండీహోమానికి ఉభయదారులుగా యార్లగడ్డ వెంకట రత్నకుమార్ హరిప్రియ, సౌజన్య, ఆదిత్యప్రణవ్ కుటుంబ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ముగిసిన లక్ష కుంకుమార్చన



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ గాయత్రీ దేవి లక్ష కుంకుమార్చన పూజలు పూర్ణాహుతి కార్యక్రమంతో గురువారం ముగిశాయి. స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా బ్రహ్మశ్రీ శ్రీనివాసల లక్ష్మిపార్థసారథి పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణాహుతిని ఆలయ పాలకమండలి చైర్మన్ మద్దు గోపి దంపతులు హోమగుండంలో సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

కె.కోట ఎంపీడీవోగా సరళకుమారి



ఎంపీడీవో సరళకుమారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కామవరపుకోట: కామవరపుకోట ఎంపీడీవోగా ముళ్ళగిరి సరళకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఏలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ప్రభుత్వ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆమె 2016 నుంచి 2017 వరకు ఎంపీడీవోగా ఇక్కడే పనిచేశారు. ప్రస్తుతం మరోసారి ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆమెను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సరళకుమారి మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. పంచాయతీ అధికారులు విధుల్లో అలసత్వం లేకుండా పనిచేయాలని, ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యంతోపాటు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆమె వారికి సూచించారు.

కల్వర్టు తూరల్లో పేరుకుపోయిన చెత్త



తూరల్లో చెత్తా చెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన దృశ్యం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం సమీపంలో ఉన్న జల్లేరు వాగు కల్వర్టు తూరల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. దీనివల్ల నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడుతుందని, వెంటనే అధికారులు స్పందించి ఆ చెత్తాచెదారాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ సౌర కాంతులు

- పీఎం సూర్య ఘర్‌తో నిరంతర విద్యుత్ కాంతులు
- ఇళ్లపై సోలార్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలకు చెక్
- పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలో 97 దరఖాస్తులు



సోలార్ రూఫ్‌టాప్

బుట్టాయగూడెం: గ్రామాల్లో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలకు చెక్ పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటా నిరంతర విద్యుత్ వెలుగులు ఉండాలనే లక్ష్యంతో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేలా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా ఇంటి పైభాగంలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్ ఉత్పత్తిని చేసి ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుంది. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు సబ్సిడీ కూడా ఇస్తుండడంతో ఈ పథకానికి విశేషమైన స్పందన వస్తుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలో ఈ పథకం అమలుపై అవగాహన కలిగిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

97 దరఖాస్తుల రిజిస్ట్రేషన్

పోలవరం, చింతలపూడి నియోజకవర్గ పరిధిలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్‌ల ఏర్పాటుకు 97 మంది దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. త్వరలోనే వాటిని పరిశీలించి ఇళ్లపై రూఫ్‌టాప్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్ అందించేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ పథకం ద్వారా రాయితీలు గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిసాయని అధికారులు చెబుతున్నారు.

పీఎం సూర్య ఘర్ పథకం అమలు ఇలా

పీఎం సూర్య ఘర్ పథకంలో దరఖాస్తు చేసుకుని మంజూరైన వినియోగదారుల ఇళ్లపై సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేస్తారు. ఇంటి పైభాగంలో 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసి కిలోవాట్ రూఫ్‌టాప్ కోసం 3, 4 సోలార్ ప్యానల్స్‌ను అమరుస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా సోలార్ ఉత్పత్తి వినియోగాన్ని లెక్కిస్తారు.

పీఎం సూర్యఘర్ యోజనకు సబ్సిడీ

పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్నవారికి ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78 వేల సబ్సిడీ ఇవ్వనుంది. ఇళ్లపై సోలార్ సిస్టమ్ 3 కిలోవాట్స్ ఏర్పాటు చేసుకుంటే సుమారు రూ. 2 లక్షల 10 వేలు ఖర్చవుతుంది. సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము లబ్ధిదారులు బ్యాంక్ ద్వారా కూడా కట్టుకునే వెసులుబాటు కల్పించారు.

మండలాల వారీగా దరఖాస్తుల రిజిస్ట్రేషన్ వివరాలు

బుట్టాయగూడెం మండలం	2
జీలుగుమిల్లి	11
కామవరపుకోట	12
జంగారెడ్డిగూడెం	34
చింతలపూడి	7
టి. నర్సాపురం	13
పోలవరం	4
కొయ్యలగూడెం	14

సోలార్ ప్యానల్ ఏర్పాటుపై అవగాహన



సోలార్ ప్యానల్ ఏర్పాటుపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. పీఎం సూర్యఘర్ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. సోలార్ ప్యానల్ ఏర్పాటు వల్ల వినియోగదారులు నిరంతరం విద్యుత్ పొందవచ్చు.

– పి.రాధాకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ డీఈ, జంగారెడ్డిగూడెం

అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అయ్యప్ప దీక్షాదారులకు గురువారం టెంపుల్స్ సెంటర్లో అన్నసమారాధన నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు సౌజన్యంతో అయ్యప్ప స్వామి మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మంతెన రోహిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా స్వాములకు అన్న సమారాధన జరిపారు.

అరకొరగా పోలవరం నిర్వాసితుల నిధులు

- ఆప్షన్ 2, 3 లకు సంబంధించి కావాల్సింది రూ.500 కోట్లు
- కానీ చంద్రబాబు ప్రభుత్వం విదిల్చింది రూ.107 కోట్లు

వేలేరుపాడు: పోలవరం ముంపులో ఉన్న 35, 41.15, కాంటూర్ పరిధిలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ వ్యక్తిగత ప్యాకేజీ అందించేందుకు చంద్రబాబు ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేసింది. ఈ రెండు మండలాల్లో 25 గ్రామాల్లో నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ వ్యక్తిగత పరిహారంతోపాటు, ఇంటి విలువలు(స్ట్రెక్చర్ వాల్యూస్), ఆప్షన్ 2, 3 లకు సంబంధించి మొత్తం సుమారు రూ.500 కోట్లు అవసరం ఉండగా, కేవలం రూ.107 కోట్లు ప్రభుత్వం విదిల్చింది. ఇందులో నిర్వాసితుల వ్యక్తిగత ప్యాకేజీకి రూ.80 కోట్లు విడుదల చేయగా, నిర్వాసితులు ఎంచుకున్న ఆప్షన్ 2, 3 లకు సంబంధించి రూ.27 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఆప్షన్ 1 కు గిరిజనేతరులై ఉంటే రూ.6 లక్షల 36 వేలు, గిరిజనులకైతే రూ.6 లక్షల 86 వేలు, ఆప్షన్ 2 ఉంటే ఒక్కో నిర్వాసితుడికి రూ.9 లక్షల 21 వేలు, ఆప్షన్ 3 కింద రూ.10 లక్షల 21 వేలు, ప్రభుత్వం ఆర్అండ్ఆర్ వ్యక్తిగత పరిహారం అవ్వనుంది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు మంజూరు చేసిన రూ.2800 కోట్లలో కేవలం రూ.107 కోట్లు మాత్రమే సీఎఫ్ఎంఎస్ ఎకౌంట్ (కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో గురువారం జమ అయ్యాయి. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మొత్తం 7020 మంది నిర్వాసితులుండగా 2210 మంది నిర్వాసితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.148 కోట్ల 54లక్షల 74 వేల పరిహారం అందజేశారు. ఆప్షన్ 3 కింద 24 మంది నిర్వాసితులకు రూ.92 లక్షల 40 వేలు, ఆప్షన్ 2 కింద రూ.31 మందికి రూ.88 లక్షల 35 వేలు పరిహారంగా అందించారు. ప్రస్తుతం 4810 మంది నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ వ్యక్తిగత ప్యాకేజీకి రూ.300 కోట్ల 36 లక్షల 78 వేల పరిహారం అందించాల్సి ఉంది. ఆప్షన్ 2, 3 కింద 2323 మంది నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇవి కాకుండా స్ట్రెక్చర్ వాల్యూస్ (ఇంటి విలువలు) పరిహారం కింద 25 గ్రామాల్లో సుమారు 100 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.107 కోట్లు ఏ ప్రాతిపదికన ఏ గ్రామాలకు ఈ పరిహారం అందిస్తారో...? ఎంత మంది నిర్వాసితులకు చెల్లిస్తారో...? చూడాల్సిందే. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి ఉంటే నిర్వాసితులందరికీ మేలు జరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: పర్రెడ్డిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎంహెచ్‌క్యూ1 లైన్‌లో పోల్స్ ఎత్తు నిమిత్తం, ఏబీ స్విచ్‌లు బాగుచేయు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి గణపతి టౌన్‌షిప్, న్యూ బ స్టాండ్, ఏలూరు రోడ్డు, మారుతి నగర్, సూర్య కాలేజీ రోడ్డులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే మెట్ట మీద సబ్‌స్టేషన్ పరిధిలో న్యూ ఫీడర్ వర్క్ నిమిత్తం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు కాలేజీరోడ్డు, సాలిపేట, జేపీ సెంటర్, శ్రీనివాస పురంరోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీఆర్ఏలకు కనీస వేతనం అమలు చేయాలి

కుక్కునూరు: వీఆర్ఏలకు కనీస వేతనం అమలు చేసి నామినీలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో వీఆర్ఏల సమావేశం పోచారపు వెంకన్నబాబు అధ్యక్షతన జరిగింది. సాయికిరణ్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు చాలీచాలని వేతనాలతో కుటుంబపోషణ గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వీఆర్ఏల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని వారితో సంబంధంలేని పనులు చేయించొద్దని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, వీఆర్ఏ యూనియన్ కార్యదర్శి కురాకుల మోహన్‌రావు, వీఆర్ఏలు మారుతి, సుజాత, భూక్య చందు, శంకర్,శ్రీనాథ్, ఇరకం రాజు, చినరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి శేషవస్త్రాల వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ అమ్మవారి శేష వస్త్రాల వేలం పాట గురువారం మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి చీరలను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సామ్రాజ్యలక్ష్మి, జయవరపు సుధారాణి, బేబీ సరోజినీ, సకినాల వెంకట కిషోర్, చిట్లూరి హనుమాన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కోసం యువత కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

చింతలపూడి: ప్రపంచ వ్యాప్తంగా జనాభా సమస్య పెరుగుతున్న కారణంగా పేదరికం కూడా అదే స్థాయిలో పెరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పేదరిక నిర్మూలనా దినోత్సవాన్ని ఎకనామిక్స్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు శ్రీనివాసరావు వివరించారు. దేశంలో ఉన్న 60 శాతం మంది యువత దేశ అభివృద్ధి కోసం నడుం బిగించినట్లుఅయితే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. ఎకనామిక్స్ అధ్యాపకులు డి శంకరపోలయ్య మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం, మురికివాడల నిర్మూలన, పౌష్టికాహారం, పరిశుద్ధమైన నీరు అందించడం ద్వారా పేదరిక నిర్మూలన చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ' నిధులు పక్కదారి పట్టిస్తున్నారు



జన సంచారంలేని ప్రదేశంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారని చూపిస్తున్న మంగరాజు

బుట్టాయగూడెం: పల్లె పండుగ వారోత్సవాల్లో టీడీపీ నాయకులు నిధులను పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు ఆరోపించారు. గురువారం ఆయన పల్లె పండుగ కార్యక్రమంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డిగణపవరం పంచాయతీలో రూ. 20 లక్షల వ్యయంతో జన సంచారం లేని ప్రదేశంలో సీసీ రోడ్లు నిర్మిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఇంటికి 130 మీటర్ల రోడ్డును నిర్మిస్తున్నారని ఆ రోడ్డు వైపు ఎవ్వరూ నివసించడంలేదని చెప్పారు. కేవలం టీడీపీ నాయకుడి కోసమే రూ.5 లక్షల నిధులు కేటాయించడం బాధాకరమని అన్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోర్సా జలపాలు, కుంజా రవి, కె. రామ్‌చరణ్, పి.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో రైతు సదస్సు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యసాయ రంగ సమస్యలపై ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే జాతీయ రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో గురువారం సంఘం జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, ఐక్య ఉద్యమాల ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చిస్తారని చెప్పారు. అన్ని పంటల రైతులు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి



కొయ్యలగూడెంలో సమీక్షిస్తున్న తహసీల్దార్

కొయ్యలగూడెం: గ్రామసభలను విజయవంతం చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులకు తహసీల్దార్ కె.చెల్లనదొర ఆదేశాలు జారీ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీరికి గ్రామసభలపై దిశా నిర్దేశం చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి నవంబర్ 14 వరకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రామ సభల నిర్వహణలో అర్జీదారులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సభలకు సంబంధించిన షెడ్యూల్‌ని ఆయన విడుదల చేశారు. 18వ తేదీ మహాదేవపురం, 19న కన్నాపురం, 22న మంగపతి దేవిపేట, 23న పరింపూడి, 24న దిప్పకాయలపాడు, 25న సరిపల్లి, 26న వేదాంతపురం, 29న రామానుజపురం, 30న బయ్యన్నగూడెం, నవంబర్ 1న కన్నాయిగూడెం, 2న చొప్ప రామన్నగూడెం, 5న పొంగుటూరు, 6న గవరవరం, 7న ఈవీడీపాలెం, 8న రాజవరం, 12న యర్రంపేట, 13న కనకాద్రిపురం, 14న కుంతలగూడెం, గ్రామ సచివాలయాల వద్ద సభలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

చింతలపూడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములు రీసర్వే జరిపిన గ్రామాల్లో ఈనెల 18 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి ప్రమద్వర గురువారం తెలిపారు. గ్రామ సభల్లో రీసర్వే విషయంలో రైతులకు సమస్యలు ఉన్నట్లు అయితే అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఫిర్యాదులు అందజేస్తే, వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. 18వ తేదీన గున్నేపల్లి, 19న రంగాపురం ఖండ్రిక, 22న గుడిపాడు ఖండ్రిక, 23న గోపాలపురం, 24న లక్ష్మీ నరశింహపురం గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని, రైతులు తమ భూముల రీసర్వేకి సంబంధించి గ్రామ సభల్లో ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

నేటి నుంచి రీ సర్వే గ్రామసభలు

పోలవరం రూరల్: గతంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం నిమిత్తం గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఆర్ఎస్.రాజు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఈ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని రైతులు కార్యక్రమానికి హాజరై సర్వే వల్ల ఏమైనా ఇబ్బందులు, అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న ఎడల గ్రామసభకు తెలియజేయాలన్నారు. ఈ నెల 18న వింజరం, 19న ప్రగఢపల్లి, 22న వెంకటాపురం, 23న పట్టిసీమ, 24న గూటాల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసం..

ద్వారకాతిరుమల: గత ప్రభుత్వ హయాంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 18 నుంచి గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జేవీ సుబ్బారావు తెలిపారు. అందులో భాగంగా 18న సీహెచ్ పోతేపల్లి, 19న గుండుగొలనుకుంట, 22న మల్లేశ్వరం, 23న రాళ్లకుంట, 24న సత్తెన్నగూడెం, 25న వెంకటకృష్ణాపురం, 26న తిమ్మాపురం, 29న మలసానికుంట, 30న కృష్ణాపురం, వచ్చేనెల 1న హవేలి లింగపాలెం, 2న వేంపాడు, 5న జాజులకుంట, 6న గొల్లవానికుంట కండ్రిక, గోపీకుంట కండ్రిక, 7న దాడవల్లి, 8న సత్తాల, 12న పి.కన్నాపురం గ్రామాల్లో ఈ సభలను నిర్వహిస్తామన్నారు.

జాతీయ రహదారి పనులకు పారదర్శకంగా భూసేకరణ



బుట్టాయగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి

బుట్టాయగూడెం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో నూతన జాతీయ రహదారి పనులకు సంబంధించి భూసేకరణ పారదర్శకంగా ఉండేలా తగు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆమె భూసేకరణ రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం నుంచి జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలంలో రెడ్డిగణపవరం, కేఆర్‌పురం, పోలవరం మండలంలో ఎల్ఎన్‌డీ పేట నుంచి పట్టిసీమ వరకూ సుమారు 40.4 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 365 బీబీ విస్తీర్ణ పనులు జరగనున్నట్లు తెలిపారు. సుమారు 12 గ్రామాలను కలుపుతూ ఈ రహదారి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రహదారి విస్తీర్ణానికి సంబంధించి సుమారు 258 ఎకరాల భూమి అవసరమవుతుందని, ఇందులో 150 ఎకరాలు పట్టా భూములు ఉన్నాయని చెప్పారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం ఉన్నందున భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుట్టాయగూడెం మండలంలో 34 ఎకరాలు భూసేకరణ చేయడం జరుగుతుందని దీనికి సంబంధించి 8 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆ ఫిర్యాదులపై రికార్డులను పరిశీలించడం జరిగిందని, అవి ఎక్కువగా రెడ్డిగణపవరం నుంచి వస్తున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్, వీఆర్ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు



గుంజవరంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో కె.అద్దయ్య

పోలవరం రూరల్: మండలంలోని ప్రగఢపల్లి పంచాయతీ గుంజవరం గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఆర్డీవో కె.అద్దయ్య గురువారం తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో నిల్వలను పరిశీలించి బియ్యం 9.34 క్వింటాళ్లు, పంచదార నాలుగు ప్యాకెట్లు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. డీలర్ జె.గంగరాజుపై 6ఏ కేసు నమోదు చేశారు. రేషన్ షాపుల్లో సరుకు నిల్వలు, రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట పోలవరం తహసీల్దార్ ఆర్ఎస్.రాజు ఉన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పెద్ద రామాలయంలో వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలో గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర భజన సమాజం వారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. పెద్ద రామాలయంలో ఈ కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. అదేవిధంగా కుంతలగూడెం ఎంపీయూపీ స్కూల్లో వాల్మీకి జయంతి నిర్వహించారు. విద్యార్థులకు వాల్మీకి రచించిన రామాయణం గురించి ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ వివరించారు. ఈ సందర్భంగా రామాయణంపై క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు వాల్మీకి రామాయణం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహాకవి వాల్మీకి జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ వాల్మీకి మహాకవిగా మారి రామాయణం రచించారని, ఆయన జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.